ఆర్టీసీ షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట ఉద్రిక్తత

● పండ్ల బండ్లను తొలగించవద్దని రోడ్డుపై బైఠాయించిన నిర్వాహకులు



ఆర్టీసీ బస్టాండ్ ఎదుట రోడ్డుపై బైఠాయించిన తోపుడుబండ్ల నిర్వాహకులు

స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ ఆదాయాన్ని పెంచడానికి బస్టాండ్‌లో కమర్షియల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టారు. ఆయా షాపులకు ఆర్టీసీ అధికారులు టెండర్లు వేయగా కొంతమంది దక్కించుకున్నారు. అయితే ఆర్టీసీ అధికారులు మూడు నెలల క్రితం షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట ఉన్న తోపుడు బండ్ల తీసివేయాలని నిర్వాహకులను కోరారు. శనివారం తోపుడు బండ్లను తీసివేయడానికి మున్సిపల్ సిబ్బంది సహాయంతో జేసీబీని తీసుకురావడంతో నిర్వాహకులు ఒక్కసారిగా ఆందోళనకు దిగారు. తోపుడు బండ్లను తీసివేయవద్దంటూ జేసీబీ ఎదుట రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఆర్టీసీ షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట కొంతసేపు ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇటు ఆర్టీసీ షాపులను అద్దెకు తీసుకున్న వారికి, అటు తోపుడుబండ్ల వారికి నష్టం జరగకుండా నిర్ణయాలు ఉండాలని, ఏకపక్షంగా తీసుకోవద్దని ఆర్టీసీ అధికారులను సూచించినట్లు తెలిసింది.

మేము ఎలా బతకాలి

ఎన్నో ఏళ్ల నుంచి ఆర్టీసీ బస్టాండ్ ఎదుట తోపుడు బండ్లపై పండ్లు అమ్ముకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని, ఇలా అర్ధాంతరంగా తీసివేయాలంటే మేము ఎలా బతకాలని తోపుడబండ్ల నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు. 30, 40 ఏళ్ల నుంచి ఇక్కడ పండ్లు విక్రయిస్తున్నామని, ఆర్టీసీ, మున్సిపల్ అధికారులు జేసీబీలతో తీసివేస్తామని చెప్పడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తోపుడు బండ్లను తీసివేయకుండా మమ్మల్ని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎంఐఎం నాయకులు అక్కడికి చేరుకొని ఆర్టీసీ అధికారులతో మాట్లాడారు. తోపుడబండ్ల వారికి ప్రత్యామ్నాయం చూపకుండా తొలగిస్తామనడం సరికాదన్నారు. వారికి నష్టం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

■ ఈ విషయమై ఆర్టీసీ ఆర్‌ఎం సంతోష్‌కుమార్ స్పందిస్తూ మూడు నెలల క్రితం ఆర్టీసీ షాపింగ్ కాంప్లెక్స్ ఎదుట ఉన్న పండ్ల తోపుడుబండ్లను తీసివేయమని చెప్పినా కొంతమంది తీసివేయలేదన్నారు. వారికి ప్రత్యామ్నాయం చూపాలని ఎమ్మెల్యే చెప్పారని, దీనిపై త్వరలోనే నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

క్లుప్తంగా

గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం



జడ్చర్ల: ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మండలంలోని పోలేపల్లిసెజ్‌లోని ఎస్‌ఐఎంఎంఎస్ యూనివర్సిటీ డిప్యూటీ రిజిస్ట్రార్ మహేశ్ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నారు. ఇటీవల యూనివర్సిటీలో అత్యధిక సంఖ్యలో రక్తం యూనిట్లను సేకరించడంపై ఈ పురస్కారాన్ని అందజేశారు. అదేవిధగా మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జన్మదినం సందర్భంగా అత్యధికంగా రక్తదానం చేయడంతో ఆయనకు పురస్కారాన్ని అందజేశారు. లక్ష్మారెడ్డి తరఫున జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ యాదయ్య, నాయకులు ప్రణీల్‌చందర్, వెంకటేశ్వర్‌రెడ్డి, నాగిరెడ్డి తదితరులు పురస్కారాన్ని అందుకున్నారు.

కేవీపీఎస్ శిక్షణ తరగతులు ప్రారంభం



మహబూబ్‌నగర్ రూరల్: కేవీపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి సామాజిక శిక్షణ తరగతులు అంబేడ్కర్ కళాభవన్‌లో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కేవీపీఎస్ జెండాను జిల్లా అధ్యక్షుడు మాణిక్యంరాజు ఎగుర వేశారు. శాస్త్రీయ ఆలోచనపై రాములు, మతం–మతతత్వం తరగతులు కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ బోధించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ.. దళితుల సమస్యలపై సమగ్ర అవగాహన కల్పించేందుకు శిక్షణ తరగతులు ఉపయోగపడతాయన్నారు. ఆదివారం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం, కుల వివక్ష, అంటరానితనంపై తరగతులు ఉంటాయని పేర్కొన్నారు. శిక్షణ తరగతుల్లో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కుర్మయ్య, ఉపాధ్యక్షులు బాలరాజు, వెంకట్రాములు, నాగరాజు, మనోహర్, శంకర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



జడ్చర్ల: స్థానిక వెంకటేశ్వర కాలనీలో ప్రధాన రహదారిపై సీసీ పనులను శనివారం ప్రారంభించారు. 167జాతీయ రహదారిని అనుసరించి పలు కాలనీలకు వెళ్లే ప్రధాన రహదారిని సీసీగా నిర్మించాలని కొన్నేళ్లుగా స్థానికులు అధికారులు, పాలకులను కోరుతున్నా.. ఇన్నేళ్లు పట్టించుకోలేదు. ఇటీవల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పందించి టీయూఎఫ్‌ఐడీసీ నుంచి 3వ వార్డుకు రూ.1.15కోట్లు మంజూరు చేశారు. అందులో భాగంగా ఇక్కడ సీసీరోడ్డు వేసేందుకు నిధులు మంజూరు చేయించి శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. పనులను నాణ్యతగా సకాలంలో పూర్తయ్యేలా చూడాలని కాలనీవాసులు విజ్ఞప్తి చేస్తున్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఈపీసీఓ రాష్ట్ర అధ్యక్షుడిగా హరీశ్‌కుమార్



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల(సీఓ) సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కోయిల్‌కొండ ఎంపీడీఓ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న హరీశ్‌కుమార్ ఎన్నికయ్యారు. ఈ మేరకు శనివారం జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. హరీకు ఈ పంచాయతీ కంప్యూటర్ ఆపరేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సురేందర్, మధు అభినందనలు తెలిపారు.

మొక్కజొన్న క్వింటాల్ రూ.2,251

జడ్చర్ల: పట్టణంలోని బాదేపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులో శనివారం మొక్కజొన్న క్వింటాల్ గరిష్టంగా రూ.2,251, కనిష్టంగా రూ.1,301 ధరలు లభించాయి. అలాగే ఆముదాలు క్వింటాల్ రూ.6,339, రాగులు రూ.2,810, ధాన్యం హంస రకం గరిష్టంగా రూ.1,820, కనిష్టంగా రూ.1,617, ఆర్ఎన్ఆర్ గరిష్టంగా రూ.1,972, కనిష్టంగా రూ.1,605 ధరలు లభించాయి.

రహదారికి మరమ్మతు



భూత్పూర్: మున్సిపాలిటీలోని గోప్లాపూర్ వద్ద శనివారం మున్సిపల్ అధికారులు రహదారికి మరమ్మతులు చేపట్టారు. కొన్నేళ్ల కిందట రహదారికి విస్తరణకు నిధులు మంజూరు కాగా.. సదరు కాంట్రాక్టర్ భూత్పూర్ నుంచి కొత్తమొల్గర వరకు బీటీరోడ్డు వేశారు. గోప్లాపూర్ వద్ద అర కిలోమీటర్ మేర రైతులకు చెందిన భూములు కావడంతో పరిహారం కోసం హైకోర్టును ఆశ్రయించి పనులు నిలుపివేయాలని ఉత్తర్వులు తెచ్చుకోవడంతో రోడ్డు మరమ్మతులు చేపట్టలేదు. మహబూబ్‌నగర్ నుంచి నాగర్‌కర్నూల్, శ్రీశైలం వెళ్లే ప్రధాన రహదారి కావడంతో ప్రతినిత్యం వందలాది వాహనాలు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. భూత్పూర్ మున్సిపల్ ఆర్ఐ నర్సింహులు, వార్డు ఆఫీసర్ వెంకట్‌రెడ్డి సిబ్బందితో కంకర, డస్టు వేసి గుంతలు పూడ్చారు. దీంతో వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఇందిరమ్మ ఇంటికి శ్రీకారం



దేవరకద్ర: మండలం నార్లోనికుంట్లలో శనివారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఎంపీడీఓ శ్రీనివాసరావు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. గ్రామానికి ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి 15 ఇండ్లు మంజూరు చేసి లబ్ధిదారులకు ఇటీవల ప్రొసీడింగ్స్ అందజేశారు. గ్రామానికి చెందిన లక్ష్మీశేఖర్ ఇంటి నిర్మాణానికి మార్క్ అవుట్ ఇచ్చి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు అంజిల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రామాంజనేయులు, రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కృష్ణమాంబ ఆరాధనోత్సవాలు



అడ్డాకుల: మండలంలోని కందూర్‌లో వెలిసిన శ్రీకృష్ణమాంబ ఆలయం వద్ద 25వ ఆరాధన సహిత సప్తాహ మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల నిర్వాహకుడు, ప్రముఖ వైద్యుడు గంగాధర్‌గౌడ్ ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకం చేయించారు. అదేవిధంగా ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు కృష్ణమాంభ ఆలయం నుంచి ధ్వజాన్ని తీసుకెళ్లి అక్కడ పూజలు చేశారు. తర్వాత ధ్వజాన్ని మేళతాళాలతో ఊరేగింపుగా కృష్ణమాంభ ఆలయానికి తీసుకొచ్చి ఉత్సవాలను ఆరంభించారు. ఆలయం వద్ద భక్తులకు నిత్యాన్నదానాన్ని డాక్టర్ గంగాధర్‌గౌడ్ ప్రారంభించారు. ఈనెల 21 వరకు ఉత్సవాలు కొనసాగుతాయి. కార్యక్రమంలో అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

సీఎం నేతృత్వంలో సామాజిక న్యాయం

స్టేషన్ మహబూబ్‌నగర్: సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క నేతృత్వంలోని ప్రభుత్వంలో అన్నివర్గాలకు సామాజిక న్యాయం దక్కుతున్నదని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా అన్నారు. జిల్లా కేంద్రంలో సొసైటీ ఆధ్వర్యంలో నిరుపేదలకు బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన 18నెలల కాలంలో ఎన్నో సంక్షేమ పథకాలు, అన్నిమతాల వారికి సమాన అవకాశాలు కల్పించారని తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి మహ్మద్ యాకుబ్, మహ్మద్ మహెబూబ్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

● ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కోడూర్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజాప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. ఇల్లు రాలేదని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మొదటి విడతలో ఇల్లు మంజూరైన వారు తక్షణమే తమ ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలన్నారు. నిర్మాణ దశలను బట్టి సకాలంలో బిల్లులు వచ్చేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఉబేదుల్లా కొత్వాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ అనిత, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్ ముదిరాజ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, నాయకులు ఎన్‌పీ వెంకటేశ్, సురేందర్‌రెడ్డి, గోవింద్‌యాదవ్, శ్రీనివాస్‌యాదవ్, అనిల్‌కుమార్, రవీందర్, రామస్వామి, ఆంజనేయులు, ప్రసాద్, కృష్ణయ్య, కేశవులు, రవికుమార్, కుర్మయ్య, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖలీల్

స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ జేఏసీ నాయకులు, అధికారుల త్రిసభ్య కమిటీ, మంత్రివర్గ ఉపసంఘం జరిపిన చర్చల్లో ఆమోదించిన ఉద్యోగ, ఉపాధ్యాయుల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఆల్‌మేవా జిల్లా కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అబ్దుల్ ఖలీల్, డాక్టర్ మహ్మద్ సులేమాన్ కోరారు. జిల్లా కేంద్రం షాసాబ్ గుట్టలోని సంఘం కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన జిల్లా సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్రంలో 317 జీవోతో న్యాయం జరగకుండా మిగిలిపోయిన, ప్రధానంగా స్థానికత ఆధారంగా దూరప్రాంతాల్లో పనిచేస్తున్న వారికి, వారి స్థానిక ప్రాంతాల్లో పోస్టింగ్‌లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో భార్యాభర్తల కేటగిరీలో కొంతమందికి బైపోస్టులో పోస్టింగ్ ఇచ్చిన విద్యాశాఖ, మరికొంత మందికి ఇవ్వడం లేదని, ఇది సమంజసం కాదన్నారు. స్పౌజ్ కేటగిరిలో అర్హత ఉన్న ఉపాధ్యాయులందరికీ అవసరమైతే సూపర్ న్యూమరీ పోస్టులు క్రియేట్ చేసి భార్య, భర్త ఒకే వద్ద పనిచేసే విధంగా పోస్టింగ్‌లు ఇవ్వాలని కోరారు. సమావేశంలో జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు ఖాదర్‌వలీ, ఉపాధ్యక్షుడు మహ్మద్ షరీఫ్, సలహాదారుడు మహ్మద్ అబ్దుల్ ఖయ్యూం, న్యాయ సలహాదారు అబ్దుల్ వహాబ్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు హబీబ్ అబ్దుర్ రహెమాన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీలో చెత్తాచెదారం తొలగింపు



జేసీబీతో చెత్తాచెదారం తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కొన్ని నెలలుగా పాతపాలమూరులోని హరిజనవాడలో డ్రైనేజీ పూర్తిగా చెత్తాచెదారంతో నిండిపోయి దుర్వాసనతో స్థానికులు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఎట్టకేలకు స్పందించి శనివారం చెత్తాచెదారం, మట్టి, ఇతర వ్యర్థాలను జేసీబీతో తొలగించారు. దీంతో స్థానికులు ఏర్పుల నాగరాజు, సంగీత, శంకర్ తదితరులు సంతోషం వ్యక్తం చేశారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఆనంద్‌కుమార్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక చిన్నదర్పల్లిలో చేపట్టిన సీసీరోడ్డు పనులను శనివారం మున్సిపల్ మాజీ చైర్మన్ ఆనంద్‌కుమార్ గౌడ్ పరిశీలించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మణ్‌నాయక్, పరందాములుగౌడ్, నాగరాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పేపర్ మిల్లు వద్ద గ్రామస్తుల ఆందోళన



ఫ్యాక్టరీ వద్ద ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

భూత్పూర్: మండలంలోని పాతమొల్గర శివారులోని శ్రీవెంకటేశ్వర ఇండస్ట్రీస్ (పార్సిల్ అట్టల తయారీ) వద్ద శనివారం గ్రామస్తులు ఆందోళన చేపట్టారు. గ్రామ సమీపంలోని సుడి చెరువులోకి కొన్నేళ్లు వ్యర్థాలను వదలుతున్నారని, ఈ ఏడాది మరింత అధికంగా ఇండస్ట్రీస్ వారు వ్యర్థాలను వదలడంతో చెరువు కలుషితమౌతుంది. ఈ చెరువు నుంచి మరో 9 చెరువుల్లోకి కలుషిత నీరు చేరి రోగాలబారిన పడుతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. పేపర్ ఇండస్ట్రీస్ వారు కంపెనీ అనుమతులకు లోబడి, నిబంధనల ప్రకారం నిర్వహించాలని, చెరువుల్లోకి వ్యర్థాలు వదలడంతో చేపలు మృతిచెందడంతోపాటు నీరు కలుషమౌతుందని కంపెనీ యాజమాన్యానికి పలు పర్యాయాలు చెప్పినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంకటేశ్వర ఇండస్ట్రీస్ సంబంధించిన అనుమతి పత్రాలతోపాటు కంపెనీలో తాత్కాలికంగా పనులు నిలిపివేయాలని కంపెనీ సిబ్బందికి ఆదేశించారు. పోలీస్‌స్టేషన్‌లో కంపెనీకి సంబంధించిన అనుమతి పత్రాలు అందజేయాలని కంపెనీ సిబ్బందిని పోలీసులు ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ నరేశ్‌గౌడ్, పాతమొల్గర మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, నాగరాజు, రామన్‌గౌడ్, చక్రపాణిగౌడ్‌లో పలువురు గ్రామస్తులు ఉన్నారు.

ఇండస్ట్రీ యజమానిపై కేసు నమోదు

మండలంలోని పాత మొల్గర శివారులో ఉన్న శ్రీ వెంకటేశ్వర ఇండస్ట్రీ (అట్టల తయారీ) యజమాని ఆదర్శ గుప్తాపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ చెప్పారు. ఎస్ఐ కథనం ప్రకారం.. శ్రీ వెంకటేశ్వర ఇండస్ట్రీ నుంచి కొన్నేళ్లుగా కెమికల్ వాటర్‌ను గ్రామంలోని సుడి చెరువులోకి వదులుతున్నారు. పంచాయతీ కార్యదర్శి సునీత పలుమార్లు నోటీసులు జారీ చేసినా యజమాని పట్టించుకోలేదు. శనివారం కార్యదర్శి సునీత ఫిర్యాదు మేరకు ఇండస్ట్రీ యజమాని ఆదర్శగుప్తాపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంకావాలి



మాట్లాడుతున్న డోకూర్ పవన్ కుమార్‌రెడ్డి

భూత్పూర్: రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలని మహబూబ్‌నగర్ బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి డోకూర్ పవన్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కొత్తమొల్గరలో బీజేపీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కార్యకర్తలు గ్రామాల్లో ఉండి ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి, వాటి పరిష్కారానికి కృషిచేయాలన్నారు. అనంతరం దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జి కొండా ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. స్థానిక సంస్థలో బీజేపీ జెండా ఎగరవేసే విధంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్రకార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, కిసాన్ మోర్చ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణ, మండల అధ్యక్షుడు శ్రీను, జిల్లా కార్యదర్శి గాల్‌రెడ్డి, నాయకులు తదితరులు ఉన్నారు.

అధ్యాపక పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నారాయణపేట జిల్లా పరిధిలోని పలు గురుకులాల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆర్సీఓ ఫ్లారెన్స్‌రాణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు, గణితం, భౌతిక, రసాయన, జంతు, వృక్షశాస్త్రం పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటికి కేవలం మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులని, ఆసక్తి గలవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీరికి సోమవారం ఉదయం 11 గంటలకు మరికల్ ఎస్సీ గురుకులంలో డెమో నిర్వహిస్తామని, ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలన్నారు. పూర్తి సమాచారం కోసం సెల్ నం. 97045 50224ను సంప్రదించాలని సూచించారు.

హంగూ ఆర్భాటాల్లేకుండా బోధన



నేను ఐఏఎస్ కావాలన్న లక్ష్యం కోసం చదివా. అందుకు ప్రతిభా కళాశాల యాజమాన్యం నాకు ఎంతగానో సహకరించింది. హంగూ ఆర్భాటాలు కాకుండా ప్రతి విద్యార్థి మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంతో నేను సాధారణ విద్యార్థి నుంచి జాతీయస్థాయిలో ర్యాంకు సాధించగలిగా. ర్యాంకు సాధించేందుకు కళాశాల అధ్యాపకులు, మా కుటుంబ సభ్యులు ఎంతగానో సహకరించారు. భవిష్యత్‌లో మరిన్ని ర్యాంకులు సాధించేందుకు కృషిచేస్తా.

– మంజు, ప్రతిభ కళాశాల, 1,902వ ర్యాంకు

డాక్టర్ కావాలనే లక్ష్యంగా..



నాకు ఊహ తెలిసిన నాటినుంచి డాక్టర్ కావాలన్న లక్ష్యం కోసం చదివా. ప్రత్యేక ప్రణాళికతో ప్రతి రోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు కళాశాలలో అధ్యాపకులు చెప్పిన అంశాలను రివిజన్ చేసి, ఖాళీ సమయాల్లో అర్థం కానీ అంశాలు నేర్చుకునేందుకు ప్రయత్నించాను. ఈ క్రమంలో ఎలాంటి సందేహాలు వచ్చినా అధ్యాపకులతో నివృత్తి చేయడంతో అన్నిఅంశాలను నేర్చుకున్నాను.

– మధుకుమార్, ప్రతిభ కళాశాల 25,844వ ర్యాంకు

అధ్యాపకుల చొరవతో..



కళాశాల ప్రారంభం నుంచి అధ్యాపకులు, యాజమాన్యం ర్యాంకు సాధించేందుకు ఎంతో సహకరించారు. టైంటేబుల్ ప్రకారం తరగతులు, మంచి మెటీరియల్ వంటి వాటి ద్వారా ముఖ్యమైన అంశాలను నేర్చుకునేందుకు అవకాశం లభించింది. టీవీ, సెల్‌ఫోన్ వంటి వాటికి దూరంగా ఉండడంతో చదువుకునేందు ఎక్కువ సమయం దొరికింది. భవిష్యత్‌లో ఎంబీబీఎస్‌లో కూడా మంచి మార్కులు సాధిస్తా.

– తరుణ్‌సాయి, రిషి జూనియర్ కళాశాల, 12,286 ర్యాంకు

కళాశాల యాజమాన్యం సహకారంతో..



ఇంటర్ మొదటి సంవత్సరం నుంచి నీట్‌లో సీటు సాధించేందుకు చాలా కష్టపడి చదివా. అందుకు కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు ఎంతో సహకరించారు. ఎక్కువసార్లు మాక్ టెస్టులు పెట్టడం, వచ్చిన ప్రతిసందేహాన్ని నివృత్తి చేయడంతో చాలా సులువుగా ర్యాంకులు సాధించేందుకు దోహదపడ్డాయి. ప్రతివిద్యార్థిపై కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకోడంతో మంచి ర్యాంకు సాధించగలిగా.

– స్వర్ణకుమారి, రిషి కళాశాల, 14,825 ర్యాంకు

వరుస వానలతో రైతన్న బిజీబిజీ



నవాబ్‌పేట: పొలాలన్నీ రైతులతో బిజీబిజీగా మారాయి. తాజాగా వరుస వానలు కురువడంతో రైతుల కోలాహలంతో దుక్కులన్నీ కళకళ లాడాయి. ముందస్తుగానే పొలాలు చదును చేయడంతో వర్షాలు పడగానే విత్తనాలు వేయడం ముమ్మరం చేశారు. శనివారం కాస్తా విరామం రావడంతో ఎక్కడచూసిన పొలాలన్నీ రైతులతో నిండిపోయాయి. ఇన్నిరోజులు బీడు భూములుగా ఉన్నా పొలాలన్నీ మొత్తం ఒక్కసారిగా దుక్కులు దున్నుకోవడం విత్తనాలు వేయడం వంటి పనులతో కళకళలాడాయి.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

నవాబ్‌పేట: వ్యాధులపై జనం అప్రమత్తంగా ఉండాలని మండల వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ తెలిపారు. శనివారం ఆస్పత్రిలో ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వర్షాకాలం వ్యాధుల ప్రభావం ఉంటుందని.. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని వివరించారు. సమావేశంలో వైద్య సిబ్బంది శ్రీనివాస్, రాఘవేందర్, శరభలింగం పాల్గొన్నారు.

నీటి సరఫరా నిలిపివేత

దేవరకద్ర: మన్యంకొండ నుంచి దేవరకద్రకు వచ్చే తాగునీటి సరాఫరాను శనివారం ఉదయం నుంచి నిలిపి వేశారు. రాంరెడ్డిగూడెం వద్ద తాగునీరు సరఫరా అయ్యే బ్రాంచ్ కంట్రోల్ గేట్ వాల్ లీకేజీ కారణంగా మరమ్మతులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మరమ్మతులు పూర్తయిన తర్వాత యాథావిధిగా నీటిసరాఫరా కొనసాగుతుందని తెలిపారు. ఈ విషయంలో ప్రజలు సహకరించాలని కోరారు.

16న బసవేశ్వర జయంతోత్సవం



స్టేషన్ మహబూబ్‌నగర్: ఆది జగద్గురు పంచాచార్య యుగ మానోత్సవం, శ్రీమహాత్మ బసవేశ్వర జయంతోత్సవం ఈనెల 16న నిర్వహించనున్నట్లు కాశీ జ్ఞానసింహాసనాధీశ్వర జగద్గురు డాక్టర్ చంద్రశేఖర శివాచార్య మహాస్వాములు అన్నారు. జిల్లాకేంద్రంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేశంలో సనాతన ధర్మానికి ఒకశాఖనే వీరశైవ లింగాయత్ ధర్మమన్నారు. ఈ ధర్మ పరంపర యుగయుగాల నుంచి వస్తున్నట్లు తెలిపారు. సంఘటితం, సమన్వయం కోసం యుగ మానోత్సవం, బసవేశ్వర జయంతోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ఐదు పీఠాల పంచాచార్యులు వస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా, పట్టణ వీరశైవ సమాజం ప్రతినిధులు పాల్గొన్నారు.